క్లుప్తంగా

వైఎస్సార్ సీపీని ఆదరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

దొనకొండ: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం ..అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీని ఆదరించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. స్థానిక నాలుగు రోడ్ల ప్రాంతంలో వెలసిన శ్రీ వీరబ్రహ్మేంద్రుల స్వాముల తిరునాళ్ల సందర్భంగా మంగళవారం రాత్రి ఆమె దొనకొండకు విచ్చేసి ఆలయంలో పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభను తిలకించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని గుర్తు చేశారు. గతంలో వర్షాలు లేక పంటలు పండక వలసబాట పట్టి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొన్నారని, ప్రస్తుతం అలాంటి సమస్యలు లేకుండా సమృద్ధిగా వర్షాలు పడటంతో పాడి పంటలు సమృద్ధిగా పండుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలుపొంది మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి 2004–2009 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారని, అనేక అభివృద్ధి పనులకు బాట వేశారని గుర్తు చేశారు. 2009–14 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరించారని శివప్రసాదరెడ్డి గుర్తు చేశారు. ముందుగా వారికి కార్యకర్తలు పూలమాలలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, నూనె వెంకటరెడ్డి, కాలూరి రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

దొనకొండ: స్థానిక ఒబ్బాపురం గ్రామానికి చెందిన బత్తుల పార్వతి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల కోసం సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, వార్డు సభ్యులు బొందల రాజు, పాకనాటి దానం సమక్షంలో రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ బిలాల్ పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన డ్రిప్ తీగ చోరీ

పుల్లలచెరువు: మండలంలోని నరజాముల తండాలో 3 లక్షల రూపాయల విలువ చేసే డ్రిప్ తీగను చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. తండాకు చెందిన పి.లక్ష్మానాయక్ తనకున్న 5 ఎకరాల పొలంలో డ్రిప్ వేసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. పంటలు చివరికి రావడంతో పొలం బాగు చేయాలనే ఉద్దేశంతో డ్రిప్ తీగెను పక్కన పెట్టుకున్నాడు. బుధవారం ఉదయం పొలం వెళ్లి చూసే సరికి తీగ లేకపోవడంతో దొంగలు తీసుకెళ్లారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మానాయక్ తెలిపారు. సుమారు 3 లక్షల రూపాయల మేరకు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఘనంగా అంకాళ పరమేశ్వరి తిరునాళ్ల

కురిచేడు: మండలంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో వేంచేసి ఉన్న అంకాళ పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు చేసి నివేదించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం తాగు నీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రికి విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు మృతి

యర్రగొండపాలెం: మండలంలోని మెట్టబోడు తండా వద్ద ఆగి ఉన్న బోర్‌వెల్ బండిని మోటారు బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామానికి చెందిన కె.చిన్న అంజి (26) బైక్‌పై యర్రగొండపాలెం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో మెట్టబోడు తండా వద్ద హైవేపై నిలిచి ఉన్న బోరు బండిని ఢీకొట్టాడు. అంజికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని వైద్యం కోసం నరసరావుపేటకు తరలిస్తున్న సమయంలో మార్గంమధ్యలో మృతి చెందాడని ఎస్‌ఐ జి.కోటయ్య తెలిపారు.

గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

తాళ్లూరు: కార్యదర్శులు వేసవి కాలంలో ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రత్యేక సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడిపై, వీధిలైట్లు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలు తీసుకొచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, సర్పంచి వలి పాల్గొన్నారు.

చేపల మార్కెట్లో వసతులు కల్పిస్తాం

- రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం
- మత్స్యకారులు, మత్స్యకార నాయకులతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- చేపల మార్కెట్‌ను పరిశీలించి సమస్యలపై ఆరా



చేపల మార్కెట్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలోని చేపల మార్కెట్‌లో మౌలిక వసతులు పెంపొందించనున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. చేపల మార్కెట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. మార్కెట్‌లోని మత్స్యకార మహిళలు, షాపుల యజమానులు, మత్స్యకార నాయకులతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లోకి రావాలంటే రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని వారంతా బాలినేనికి వివరించారు. అద్దంకి బస్టాండ్ సెంటర్ నుంచి నేరుగా మార్కెట్‌లోకి వచ్చే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అందుకోసం రూ.40 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని బాలినేని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాత మార్కెట్ మాదిరిగా కొత్త మార్కెట్‌లో బాడుగలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. నెల్లూరు మార్కెట్‌లో బాడుగలు తగ్గించారని బాలినేని దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బాలినేని.. నెల్లూరు చేపల మార్కెట్లో ఏ విధంగా బాడుగలు తగ్గించారో పరిశీలించి రావాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు సూచించారు. అదే విధంగా ఇక్కడ కూడా మత్స్యకారులకు అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి శంకర్, కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ హరిబాబు, గిరిజా శంకర శాండిల్య, మోడుబోయిన సురేష్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఐలా జాలారావు, కమిటీ సభ్యులు గొల్లపోతు కోదండ రావు, చాపల విజయకుమార్, జగన్, నాయుడు మణెమ్మ, బాక్సుల ప్రసాదు, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ మిరియాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాపుల వెన్నంటే ఉంటా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: కాపుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక ఏ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి నిర్వహించిన కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను చిన్ననాటి నుంచి గద్దలగుంటలో ఉంటూ కాపు సోదరులతో మమేకమై ఉండేవాడినని గుర్తుచేసుకున్నారు. వంగవీటి మోహనరంగా మరణించిన సమయంలో నిరసనగా ఆందోళనలో పాల్గొన్నందుకు తనపై కూడా కేసులు పెట్టడం జరిగిందన్నారు. కాపులతో అప్పటి నుంచే తనకు సత్సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఈ వాసు ఎప్పుడూ మీ వెంటే ఉంటాడన్నారు. కొందరు కావాలని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, కాపు సోదరులందరూ కమిటీలుగా ఏర్పడి సమస్యలపై ప్రతి 15 రోజులకు ఒకసారి చర్చించుకుంటే ఆయా సమస్యల పరిష్కారానికి తాను కృషిచేస్తానని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కాపుల వృద్ధాశ్రమం కోసం అనువైన స్థలాన్ని కమిటీ సభ్యులు పరిశీలించి తెలియజేస్తే మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదింపజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు బాలినేనిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, కొత్తపట్నం బస్టాండు శివాలయం దేవస్థానం చైర్మన్ చాకిరి ధనుంజయ, చెన్నకేశవస్వామి కార్పొరేషన్ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, కార్పొరేటర్ తాడి కృష్ణలత, కాపు సంఘ నాయకులు గాదె వెంకట కృష్ణారావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, ఎం.నరసింహారావు, పసుపులేటి శ్రీను, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల విజయభేరి



చీమకుర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విజయకేతనం చూపుతున్న ఉమామహేశ్వర కాలేజీ డైరెక్టర్ మల్లేశ్వరరావు



984 మార్కులు సాధించిన నారాయణ విద్యార్థిని సాయిశీర్షిక



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనాగభైరవ విద్యాసంస్థల చైర్మన్ వీరబాబు



ఎంపీసీలో 951 మార్కులు సాధించిన సాయి మానసను అభినందిస్తున్న శ్రీహర్షిణి చైర్మన్



విద్యార్థులను అభినందిస్తున్న జాహ్నవి నీట్, ఐఐటీ అకాడమీ డైరెక్టర్ జనార్దన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ సరస్వతి విద్యాసంస్థల సెక్రటరీ రమణారెడ్డి

ఒంగోలు: ఇంటర్ ఫలితాల్లో ఒంగోలు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఆ వివరాలు వెల్లడించాయి. శ్రీహర్షిణి విద్యాసంస్థల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ తెలిపారు. బుధవారం రాత్రి కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఇందుర్తి సాయిమానస 991/1000 మార్కులు సాధించిందన్నారు. కె.రేణుకా చౌదరి 988/1000 మార్కులతో రెండోస్థానాన్ని, పులి అమృత 985 మార్కులతో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. బైపీసీ విభాగంలో వి.భావన, వి.స్రవంతి 981/1000 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీ విభాగంలో ఎస్‌కే నాజియా 962/1000 మార్కులతో మొదటి స్థానాన్ని సాధించడం జరిగిందన్నారు. 950కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు 50 మంది, 900కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు 108 మంది ఉన్నారని వివరించారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లోనూ పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు రవికుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కరణం నారాయణ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర విద్యార్థుల విజయకేతనం...

ఇంటర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఉమామహేశ్వర కాలేజీ డైరెక్టర్ సి.మల్లేశ్వరరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో బి.భవాని 989/1000, ఆర్.లలితకుమారి 987/1000, బైపీసీ విభాగంలో డి.గాయత్రీ శ్రీ 987/1000, యు.శర్వాణి 982/1000, ఎంఈసీ విభాగంలో 978/1000 మార్కులతో రాణించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మల్లేశ్వరరావుతో పాటు మరో డైరెక్టర్ సి.జయలక్ష్మి అభినందించారు.

శ్రీ ప్రతిభ విద్యార్థుల విజయపరంపర...

ఇంటర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు విజయపరంపర కొనసాగించారని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో పిచ్చపాటి తేజస్విని 989/1000, ఆవుల శ్రీజ, మేడూరి హారిక, పచిపాల నరేష్‌కుమార్ 987/1000, వెనాన సుమిత్రా దేవి–986/1000, గడ్డం మధు, సూరంరెడ్డి త్రికోటేశ్వరరెడ్డి, ఆనెకళ్ల సంధ్య, ఆరికట్ల దివ్యశ్రీ 985/1000 మార్కులతో పాటు 980కిపైగా 30 మంది విద్యార్థులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 985/1000 మార్కులతో పాటు బొజ్జా పూర్ణిమ సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 464/470 మార్కులను నందికంటి వెంకట తరుణ్‌క్రిష్ణ, ఆకుల పావని, దాసరి మమత, గుండారెడ్డి ప్రియాంక, మల్లవరపు పద్మావతి సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కాలేజీ వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ్ తదితరులు అభినందించారు.

జాహ్నవి విద్యార్థుల ప్రభంజనం...

తమ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని జాహ్నవి నీట్, ఐఐటీ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ ప్రకటించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో డి.డానియేల్ 431/440 మార్కులు సాధించారని, 400కుపైగా 14 మంది సాధించారని అన్నారు. బైపీసీ సీనియర్ విభాగంలో ఏ వైష్ణవి 982/1000 మార్కులు సాధించినట్లు చెప్పారు. 900కుపైగా 20 మంది విద్యార్థులు సాధించి ప్రతిభ కనబరిచారన్నారు. జూనియర్ ఇంటర్‌లోనూ పలువురు విద్యార్థులు ఉన్నతమైన ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

సత్తాచాటిన శ్రీనాగభైరవ విద్యార్థులు...

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తాచాటారని శ్రీనాగభైరవ ఐఐటీ–జేఈఈ అండ్ నీట్ అకాడమీ చైర్మన్ నాగభైరవ వీరబాబు పేర్కొన్నారు. ఓవరాల్‌గా జిల్లాలో అత్యధిక పాస్ పర్సంటేజీతో పాటు మార్కుల సాధనలోనూ ముందున్నామన్నారు. కరేటి హరిణిశ్రీ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 986/1000 మార్కులు, బైపీసీలో ఐ.నందిని 980/1000 మార్కులు, కె.ఉత్తర 978/1000 మార్కులు సాధించారన్నారు. వి.దివ్యశ్రీ జూనియర్ ఇంటర్‌లో 461/470 సాధించడంతో పాటు మొత్తం 220 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థుల్లో 75 మందికి 900కుపైగా మార్కులు వచ్చినట్లు వివరించారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

శ్రీ సరస్వతి కాలేజీ విద్యార్థుల విజయం...

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని శ్రీసరస్వతి విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆవుల వెంకట రమణారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 466/470 మార్కులతో తమ విద్యార్థి ప్రథమస్థానం సాధించామన్నారు. 465 మార్కులు ఇద్దరు, 464 మార్కులకుపైగా 11 మంది సాధించినట్లు వివరించారు. ద్వితీయ సంవత్సరంలో 987 మార్కులు ఒకరు, 986 మార్కులు ఇద్దరు సాధించినట్లు తెలిపారు.

నారాయణ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు...

తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని నారాయణ జూనియర్ కాలేజీ డీన్ ఎస్.పిచ్చిరెడ్డి తెలిపారు. ఇంటర్‌లో వి.సాయి ప్రణతి 985/1000, పి.సాయిశీర్షిక 984/1000, ఆర్‌వీఎం దీక్షిత 984/1000 సాధించారన్నారు. 980కిపైగా మార్కులను 28 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో పి.సిరిచందన 464/470, కె.సాయి మౌనిక 464/470, పి.తేజస్వి 463/470 సాధించినట్లు తెలిపారు. 460కిపైగా 87 మంది సాధించారని అభినందించారు.

చీమకుర్తి ఎంఎస్ఆర్ విద్యార్థులను అభినందించిన జెడ్పీ చైర్‌పర్సన్...

చీమకుర్తిలోని మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో విద్యార్థులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో క్రిష్టిపాటి కీర్తిరెడ్డి–990/1000, షేక్ గౌసియా–980, రావూరి అమృతవర్షిణి–977, ధర్మవరపు మనీష్‌కుమార్‌రెడ్డి–976, సయ్యద్ సమీర–973 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో కాటెపోగు అవంతిక 974, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో చుండి భానుదీపిక–459/470 మార్కులు సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి తెలిపారు.



జయభేరి మోగించిన విద్యార్థులతో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు

బీజేపీని సాగనంపుదాం



ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఎం నాయకుడు స్వామిరెడ్డి

కొత్తపట్నం: ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ పాలన, మతోన్మాదంతో వ్యవహరిస్తున్న బీజేపీని సాగనంపడానికి అందరూ ఐక్యంగా ముందుకు రావాలని సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార భేరిలో భాగంగా కొత్తపట్నం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వామిరెడ్డి మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. అదానీ, అంబానీ వంటి సంపన్నులకు దేశ సంపద దోచిపెడుతున్నారని, కార్మిక హక్కులను కాలరాసి ఉపాధి హామీ పనులను నీరుగారుస్తున్నారని దుయ్యబట్టారు. అన్నదాతల వెన్ను విరుస్తున్నారని, గ్యాస్ బండను గుదిబండగా మార్చారని మండిపడ్డారు. సామాన్యుల బతుకులను పెట్రోలు, డీజిల్ మంటల్లోకి బీజేపీ ప్రభుత్వం నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 27న ఒంగోలులోని అద్దంకి బస్టాండ్‌లో జరిగే బహిరంగ సభకు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.శ్రీను, కె.భాగ్యలక్ష్మి, పి.నవీన్, రాజశేఖర్, పి.శ్రీను పాల్గొన్నారు.

సుగంధ పరిమళాలతో సీతారాములకు అభిషేకాలు



అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఒంగోలు టౌన్: శ్రీరామచంద్రుని జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని స్థానిక గడియారంవారి వీధిలో వేంచేసియున్న సీతా సమేత అనంత కొదండరామస్వామి మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో పురుష సూక్తంతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలంకరణలతో స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులతో భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకస్వామి రాము శర్మ, వేద పురోహితులు గూడా ఫణి శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సేవా సమితి నిర్వాహకులు నిర్వహించిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని నిరసన



నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఒంగోలు: ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని ఫ్యాప్టో ప్రకాశం జిల్లా చైర్మన్ డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక పదో తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద బుధవారం మధ్యాహ్నం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాల ముఖ్య కార్యదర్శి తీరు విద్యావ్యవస్థను గాడిలో పెట్టే విధంగా లేదన్నారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కో చైర్మన్ ఎస్.రవి మాట్లాడుతూ విద్యార్థులు బూట్లు ధరించలేదని, యూనిఫాం ధరించలేదనే కారణాలతో ఉపాధ్యాయులపై చర్యలు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. బీటీఏ సీనియర్ నాయకుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ పుస్తకాలను సరైన సమయంలో పాఠశాలలకు సరఫరా చేయకుండా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం ఏమిటంటూ ప్రశ్నించారు. ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, తక్షణమే అక్రమ సస్పెన్షన్లను వెనక్కు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేటి సువర్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

త్రిపురాంతకం: రైతులకు అవసరమైన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా అందిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. వేసవిలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. త్రిపురాంతకం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులతో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుపై మాట్లాడినట్లు పేర్కొన్నారు. గతంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే రికమెండేషన్ లెటర్స్ తీసుకుని డీడీలు చెల్లించి రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని ఎస్ఈ గుర్తు చేశారు. జిల్లాలో అత్యధికంగా త్రిపురాంతకం మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాల్సి ఉందని వివరించారు.

943 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం -2లో బుధవారం 943 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. వేలానికి 980 బేళ్లు వచ్చినట్లు చెప్పారు. కేజీ గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.166, సరాసరి ధర రూ.195.59 పలికినట్లు వివరించారు.

29న పండుగుల్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీ పండుగుల్ల, చూర పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతాయని వేలం కేంద్రం-2 నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. పొగాకు రైతులు వారి వద్ద గల పండుగుల్ల పొగాకు, బేళ్ల వివరాలను శుక్రవారం లోపు వారి వారి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేయాలని సూచించారు. అలా తెలియజేసిన రైతులకు మాత్రమే గుల్ల పొగాకు అమ్మకాలకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.